★ చెల్లూరి సీతారాజేశ్వరరావు

# సీతమ్మ సంతానం

సామ్రాజ్యం టీ గ్లాసులు లోపలకి పట్టుకెళ్ళబోతూ ఆగిపోయింది. గదిలోనుంచి రంగారావు, శర్మల కంఠాలు తారాస్థాయిలో వినబడుతున్నాయి. వాళ్ళు చర్చించేది తన విషయమే కావడంతో సామ్రాజ్యం లోపల కెళ్ళలేకపోయింది. హాల్లో ఒకమూల దుప్పటి కట్టి ఆడుకుంటున్న పిల్లల్ని నెమ్మదిగా కేకవేసింది, టీ వారిద్వారా పంపిద్దామని. ఆటలు వదిలిపెట్టి రాలేదు వాళ్ళు.

"ఏమిటి మరదలా అజంతా బొమ్మలా నిలబడిపోయావు" పతంజలి సిగరెట్ కాలుస్తూ వచ్చాడు. అప్పుడే నిద్ర లేచాడేమో, ముఖంమీద జుట్టు దోబూచులాడుతోంది.

"అబ్బే .. " సామ్రాజ్యం నసిగింది.

పతంజలి లోపలకి వెళ్ళాడు. అతడి వెంట నడవడంతో సామ్రాజ్యం బెరుకు తీరిపోయింది. "అంతరంగిక సమావేశానికి మేం రావచ్చా" పతంజలి వాళ్ళని పరీక్షగా చూస్తూ అన్నాడు.

"నీకూ భాగముంది" రంగారావు టీ త్రాగుతూ అన్నాడు.

ఆరిపోతున్న దీపంలా కలవర పడుతోంది సీతమ్మ. అల్లుడు రావడంతో బీరువా వెనక్కి జరిగింది. సామ్రాజ్యం తల్లిపాదాల దగ్గర కూర్చుంది.

"వెంకటపతి సంబంధానికి అమ్మ ఒప్పుకోవడం లేదు. ఆచారంగా చెయ్యాలంటే యిప్పుడవన్నీ కుదురుతాయా? చుట్టూరా నాన్నగారు చేసిన అప్పులున్నాయి. అవి తీర్చవద్దూ? వేలకివేలు కట్నాలు పోసి సంబంధాలు చెయ్యడం

మాటలా?" రంగారావు తీవ్రంగానే అన్నాడు.

వెంకటపతి!!! సామ్రాజ్యం గుండె ఝల్లుమంది. వెంకటపతిది ఆ ఊరే. నలభై యేళ్ళుంటాయి. ఇటీవలే భార్య పోయింది కూడ.

"మావగారుంటే ఈ సంబంధం చేసే వారా?"

శర్మ పూర్తిచేశాడు "లేరు కనుకనే."

"మీ తోబుట్టువు భవిష్యత్తుపై మీకు పూచీలేదు మాట."

ఎదురుగావున్న మంచంమీద కూర్చుని పిల్లడికి పాలిస్తున్న ప్రమీల కోపంతో చిరచిర లాడిపోయింది. భర్త సమస్యని మరోవైపుకి లాగుతున్నాడు.

"వాళ్ళ శక్తినిబట్టి వాళ్ళు చేసు కుంటారు. మీకెందుకు గొడవ" కసిరింది.

"నీ పెద్దన్న నాకూ భాగముందని చెప్పాడే."

"అంత జాలిగా వుంటే మరదలి పెళ్ళి మీరు చెయ్యకూడదూ?"

సామ్రాజ్యం అందరి ధోరణీ కని పెడుతోంది. పరాయివాడు చూపించే అభి మానం సొంతవాళ్ళు చూపించడం లేదు. నాన్న పోవడంతో తను వీరికి భారమై పోయింది. ఏదోలా పెళ్ళయిందనిపించి చేతులు కడుక్కోవాలనుకుంటున్నారు.

"ఏమండీ తెమల్లేదూ?" శర్మ భార్య సుశీల బయటనుంచి కేకవేసింది.

శర్మ లేచాడు. తల్లిదగ్గరకెళ్ళి "వస్తా నమ్మా ...వీలు చూసుకుని మళ్ళీ వస్తాలే" అన్నాడు పొడిగా.

పదమూడోరోజున వుండకూడదని లేచిపోయే యితర బంధువుల్లాగే కనిపిం చాడు శర్మ ఆమెకి. మరో నాలుగురోజు లుండి యిక్కడి విషయాలు చూసుకోమని చెప్పాలనుకుంది సీతమ్మ. ఇంతలో సుశీల అత్తగారి దగ్గరగా వచ్చి, "రైలు దాటిపోతుంది" అంది భర్తని గదమా యిస్తూ. సుశీల భయం సుశీలది. తన మొగుడు వైద్యంచేసి అంతో యింతో సంపాదిస్తున్నాడు. కట్నం నువ్విచ్చుకోవా లని భర్తని ఒప్పిస్తారేమోనని ఆమె భయం.

"నేను చెబితే వింటారేమిటి నాయనా, ఎవరిష్టం వారిది. ఏలాగూ నేను మూలన పడ్డాను కదా!" సీతమ్మ విచారంగా అన్నది. సీతమ్మకి పానకం త్రాగాక ఉప్పు నీళ్ళు త్రాగినట్లుంది. విస్తృతమైన జీవితం కుదించుకు పోయింది. భర్త పోయిన విచారం ఆమెని యింకా వదిలిపెట్టలేదు. కళ్ళు ఉబ్బాంగాయి.

"మీరు బాధ పడకూడ దింక" పతం జలి కేకవేశాడు.

లాంఛనంగా నలుగురుతో చెప్పి శర్మ భార్యా వెళ్ళిపోయారు. "వాడికి బాధ్యత లేదు. నా కొచ్చిం దంతా" రంగారావు స్వగతంగా అన్నాడు.

"కావాలంటే నువ్వూ తప్పించుకో వచ్చు" పతంజలి వెటకారం విసిరాడు.

నాలుగయిన్నట్లు చూపిస్తోంది గడి యారం. ఎండగా వున్నా శ్రావణమేఘాలు వర్షాన్ని కుమ్మరిస్తున్నాయి. పచ్చటి చెట్లు ఎండా-వానలో మెరుస్తున్నాయి.

శంకరనారాయణ దేహాంతర కర్మలు ముగియడంతో వచ్చిన బంధువులు,

మిత్రులు నెమ్మదిగా జారుకున్నారు. ఇల్లంతా శూన్యంగా వుంది. పీడకళ వుట్టి పడుతోంది. ఇన్నాళ్ళు తమ మధ్యవున్న మనిషి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. సీతమ్మకీ, సామ్రాజ్యానికి మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

శంకరనారాయణ ప్రయోజకుడనే చెప్పాలి. మధ్యలో లంచాలవల్ల ఉద్యోగం పోగొట్టుకున్నా ఖాళీగా కూర్చోలేదు. అమ్మకాలు, కొనుగోలు వ్యవహారాల్లో తన లౌక్యం వుపయోగించి నాలుగురాళ్ళు సంపాదించాడు. పదివేలు కట్నమిచ్చి ప్రమీల పెళ్ళి చేశాడు. శర్మని డాక్టరు చేశాడు. రంగారావుచేత మందులకొట్టు పెట్టించాడు. ఎవరికీ లోటు చెయ్యలేదు. సామ్రాజ్యం పెళ్ళికికూడ నిల్వ చేశాడు. కాని అది ఖర్చుపెట్టడం రంగారావు, శర్మకి యిష్టంలేదు.

ప్రమీలకీ యిష్టంలేదు. తల్లి నగలు వగైరాలు పుచ్చుకోడానికి అన్నలకి మద్దత్తు ప్రకటించింది.

వీళ్ళ స్వార్థాలకి సీతమ్మ మనస్సు వుడికిపోతున్నది.

"సామ్రాజ్యాన్ని అడగరా అన్నయ్యా" ప్రమీల అన్నది.

ఆ యింట్లో యితర సమస్యలనేకం వున్నవి. ఎవరి సమస్యలకి వారే పరిష్కర్తలు. ఇది ఒక కన్నె జీవిత సమస్య. అందుకే వుమ్మడి సమస్యయి కూర్చుంది. అభిమానాలు, మమకారాలు వుంటే యింత బహిరంగంగా చర్చించే అవకాశం లేదు. అది లేకపోవడంవల్ల డబ్బుదగ్గర స్వార్థం చేత సామ్రాజ్యం పెళ్ళి చర్చావేదికయింది.

"దాని అన్నలు యింత గతిలేనివారట్రా పెద్దబ్బాయి" సీతమ్మ విచారాన్ని మరచి పోయి ముందుకు వచ్చింది. భర్తపోయిన దుఃఖం జీవితాంతం వుండేదే. ఇప్పుడు తను మౌనం వహిస్తే సామ్రాజ్యం బ్రతుకు బండలవుతుంది.

తల్లికి సమాధానం చెప్పలేక రంగారావు రౌద్రంగా చూశాడు. పతంజలి నవ్వాడు. దాంతో రంగారావు కోపం యింకా ఎక్కువయింది.

"వెంకటపతి సంబంధానికేం తక్కువే అమ్మా. వుద్యోగం మంచిది. రెండెకరాల పొలంవున్నది. పిల్లలులేరు. కట్నం యివ్వక్కర్లేదు" ప్రమీలా అంది.

"అది మాట మీ బాధ? అలా మేం బాధపడివుంటే మీరెలావుండేవారు?"

రంగారావు కిదంతా చిరాగ్గా వుంది. "యింతకీ ఏం చేద్దాం మరి?"

"చెప్పేదేముందిరా.... అమ్మకిష్టం లేదు."

"నీ వరుస చూస్తోంటే నీకభ్యంతరం లేనట్లుందే" పతంజలి అడిగాడు.

ప్రమీల భర్తకేసి రుషగా చూసింది.

"నువ్వెన్ని సంబంధాలు తిరగ్గొట్టావో జ్ఞాపకం లేదా?"

"మీ పెద్దమ్మాయి రాజకీయవాదండీ. నీతులు ఎదుటవారికే."

"మరదలి జీవితాన్ని మీరు వుద్ధరించకూడదూ?" కసిగా సవాల్ చేసింది. నలుగురిలో తనని గురించి హేళనగా మాట్లాడటం ఆమె సహించలేకపోయింది.

పతంజలి నవ్వుతూ చూశాడు. "పది




వేలు నాకో లెక్కకాదు. అలాగే చేస్తా. 'మాకు సంబంధం లేదని' నీ అన్నలు అంటే."

"మేమంత దగాకోరులమా?" రంగారావు ఉక్రోషంగా అన్నాడు.

"తెలియదంలా!"

భర్త అక్కడ వుంటే ఎటూ సమస్య జరగదని ప్రమీల గుర్తించింది. "సినిమా కెళ్ళతామన్నారుగా."

"నన్ను వెళ్ళమని చెప్పడం యిది. ఆల్ రైట్.... సామ్రాజ్యం బలవంతంగా ఒప్పుకోకు. నేనున్నా." పతంజలి వెళ్ళి పోయాడు.

"అన్నదమ్ములే అనలేక పోయారా మాట" సీతమ్మ యాంత్రికంగా అంది.

పతంజలి వెళ్ళిపోవడంతో రంగారావు స్వేచ్ఛగా కూర్చున్నాడు. తల్లి అన్నమాట ఆరిపోతున్న కోపాన్ని రెచ్చగొట్టింది.

"మేం వెధవలమని నువ్వు చెప్పక్కర్లేదు. డబ్బుంటే మంచి సంబంధం మేమే చూద్దుం."

"బ్యాంకులో ఎనిమిది వేలున్నా యిగా!"

"ఈపదిరోజుల్లో రెండువేలయింది!!"

"మిగులు?"

"చలపతిగార్కి అయిదు వేలు యివ్వా లట చేబదులు. అది యివ్వద్దు మరి? మిగతా దాంతో ఏం పెళ్ళవుతుంది?"

"అంత డబ్బు పుచ్చుకునే అవసరం ఏమొచ్చింది మీ నాన్నకి. తీసుకుంటే నాతో చెప్పరూ?" అనుమానంగా, ఆందోళనగా చూసింది సీతమ్మ.

"ఆయన పెద్దమనిషి తెల్సా? కక్కుర్తి పడి అబద్ధమాడతాడా? మనం యివ్వనంటే ఏం చెయ్యలేడు. అయినా అది గౌరవమా?"

తనకి అవసరమంటూ తండ్రి సువేగా శర్మ పట్టుకుపోయాడు. రంగారావు

యింకా పద్దు ఎత్తి వేశాడు. తనకు అంద నది తనూ జాగ్రత్త పెట్టుకోవాలని.

ప్రమీల మద్దత్తు యిస్తూ "పెద్దన్నయ్య అబద్ధం చెబుతాడా?" అంది.

సీతమ్మ మనస్సు గదిలో ఆవరించిన చీకటిలా వుంది. విచారానికి తోడు సామ్రాజ్యం పెళ్ళి. దానికి అన్యాయం జరిగిపోతోంది. ఆరాటమే కాని తనేం చెయ్యగలదు?

రాత్రి భోజనాల దగ్గర రంగారావు సంబంధాన్ని ఖాయంచేసినట్లే మాట్లా డాడు. సీతమ్మ ఏం తర్కించలేదు.

"ఏమంటావే?" భర్తవచ్చేలోగా ఆమె చేత అవుననిపించాలని ప్రమీల తొందర పడుతోంది.

సామ్రాజ్యానికి పంతొమ్మిదేళ్ళుం టాయి. చామన చాయగా పొడుగ్గా వుంటుంది. అందం, ఆకర్షణ సామాన్యం చదువుకూడా అబ్బలేదు. శ్రావ్యంగా కూనిరాగాలు తీస్తుంది. తన భవిష్యత్తుని సమీక్షించుకునే చొరవ తెలివి ఆమెకి లేవు. రెండోపెళ్ళి సంబంధంచేత కాదనా లనిపిస్తోంది. చెప్పడానికి భయం.

పైగా ప్రమీల అధికత్వాని ఆమె గర్హిం చింది. తనపెళ్ళి దానికి చాలా వేళా కోళంగా, ఆటగావుంది. అందరికంటే దీని పోరెక్కువయింది.

"నువ్వయితే ఏం చేసేదానివి?" ఎదు రడిగింది.

బురదపడ్డ తెల్లచీరలా వెలవెల బోయింది ప్రమీల.

"గట్టుమీద కూర్చుని ఎన్ని కబు ర్లయినా చెబుతారు" సీతమ్మ విసుగ్గా అంది.

ప్రమీలకి దాంతో కోపం వచ్చేసింది. "మీ యిష్టమొచ్చినట్లు చేసుకోండి" అంటూ వెళ్ళిపోయింది. మర్నాడే ప్రయా ణం కట్టింది. సీతమ్మ ఏం మాట్లాడలేదు.

"ఉత్తరం రాయి సామ్రాజ్యం" అన్నాడు బండెక్కి సామ్రాజ్యంతో పతంజలి.

దానర్థం సామ్రాజ్యానికి తెల్సింది. బావ మంచితనానికి, అన్నల దుర్మార్గానికి ఆ పిల్ల నివ్వెరపోతోంది. ఎవరు సొంత వారో ఎవరు పరాయివారో కూడా తెలి యడం లేదు. ఒకళ్ళు రక్తాన్ని బట్టి దగ్గర ఆత్మీయతకి దూరం. మరొకరు రివర్స్.

పిల్లిని అడిగి గంట కట్టరని రంగా రావు సమాధాన పరుచుకున్నాడు. ఎవరికి కోపాలు వచ్చినా తనకి తోచిందే చెయ్యా డానికి నిర్ణయించుకున్నాడు.

"మీరో సంబంధం చూడకూడదూ?" ధనలక్ష్మి సలహా యిచ్చింది. ప్రొద్దుట సామ్రాజ్యం వచ్చి తనదగ్గర బావురు మన గానే ఆమె కరిగిపోయింది.

"నీకూ వచ్చిందీ జబ్బు?"

"ఆడపిల్ల వుసురు మంచిది కాదండీ" ధనలక్ష్మి పాతతరానికి పూర్తిగా ప్రతినిధి. ఆ అలవాట్లు, ఆచారాలు, భయాలు పూర్తిగా అబ్బాయి.

"నోర్మూసుకో" భార్యను గద్దించి పదేశాడు.

రంగారావు మాట యివ్వగానే వెంకట పతి చీర పసుపుకుంకుమ పంపించాడు. పెళ్ళి కుదిరినట్లు గుర్తు. రెండు నెలల్లో

ళ్ళు పెళ్ళి జరిగిపోవాలని తీర్మానానికి వచ్చారు.

శిలమీద కురుస్తున్న వానలా నిశ్చలంగా వుంది సీతమ్మ. "నీ రాత ఎలా వుంటే అలా జరుగుతుంది. నేనేడిస్తే లాభం ఏమిటి?"

తల్లి కిష్టంలేదీ పెళ్ళి. తనకీ యిష్టం లేదు. ఎలా తప్పించుకోవాలో సామ్రాజ్యానికి తోచలేదు. అవాంఛనీయాల్ని నిరోధించడానికి అందరూ తిరుగుబాటు చెయ్యలేరు. సామ్రాజ్యం పరిధి చాల తక్కువ. నోర్మూసుకుని పెళ్ళి చేసుకోవడం లేదా యింటినుంచి తాత్కాలికంగానో, శాశ్వతంగానో నిష్క్రమించడం. ఇవేమీ సామ్రాజ్యానికి చేతకావు. ఇవి చెయ్యడానికి మొండిధైర్యం కావాలి. వీటి కంటే మంచికో చెడ్డకో పెళ్ళి చేసుకోవడమే మంచిదనిపించింది.

పెళ్ళి గుళ్ళో జరిగిపోయింది. శర్మ రాలేదు. వందరూపాయిలు సామ్రాజ్యానికి యం. ఓ. చేశాడు. ప్రమీల ఒక్కతే ముహూర్తానికి వచ్చి వెళ్ళిపోయింది. పతంజలి బొంబాయి వెళ్ళాడు వ్యాపారం విషయమై.

తను వాళ్ళకి, శాశ్వతంగా దూరమైపోయినట్లు సామ్రాజ్యం బాధపడి కొత్త కాపురానికి వెళ్ళిపోయింది.

బరువు వదలిన శ్రామికుడిలా నిట్టూర్చాడు రంగారావు.

* * *

పెళ్ళి జీవితకాలంలో జరిగే ముఖ్య సంఘటన. జీవితం ఒక మలుపు తిరుగుతుంది. చాలమంది దీన్ని వసంతకాలంతో పోల్చుకుంటారు. కాని కొంతమందకి శిశిరమయి కూర్చుంటుంది. తన గోడుకి విలపించేకంటే ఎదుటవారి గోడుకి బాధపడటం జరుగుతుంది. పెళ్ళయిన రెండో నెల్లో వెంకటపతికి టి. బి. ఎటాక్ అయింది.

వెంకటపతి కూడా ఏకాకి. కావాల్సిన బంధువులు లేకపోయినా దగ్గరి వాళ్లకూడ ఎన్నడో దూరంగా జరిగిపోయారు.

అన్నిటికీ సామ్రాజ్యమే మిగిలింది. అమాయకంగా తన సేవలకి అంకితమైపోయిన సామ్రాజ్యాన్ని చూసి వెంకటపతి నిట్టూర్పు విడిచాడు. పెళ్ళిద్వారా తను ఈమెని వంచించాడా?

"మా చిన్నన్నయ్య దగ్గరికి వెళదామండి.. డాక్టరు కదా, దగ్గరుండి అన్నీ చూస్తాడు."

భార్య మాట ఒప్పుకున్నాడు. కొన్నాళ్ళయినా యితరత్రా ఎవరయినా వుంటే ఆమెకి ధైర్యంగా వుంటుందనుకున్నాడు.

సుశీల ఆడబిడ్డని సాదరంగానే ఆహ్వానించింది. సుశీల చాల లోతైన మనిషి. ఎప్పుడూ పెదాలమీద చిరునవ్వుంటుంది. దీనివల్ల చాలమంది ఆమెని 'మంచిది' అంటూ అపార్థం చేసుకుంటారు. తన అయిష్టాన్ని కూడ ఎంతో తియ్యగా జరుపుతుంది.

"ఆయనకి క్షయ వదినా."

మకాం ఔట్‌హౌస్‌కి మార్చివేసింది వెంటనే. ఇది అంటురోగమని చాలా జాగ్రత్తగా వుండాలని చెప్పింది. సామ్రాజ్యం తను గౌరవాలు కోసం రాలేదని తన పనిమీద వచ్చిందని గుర్తు చేసు

సంది. చిన్నన్న యిచ్చే మందుల కోసం ఎక్కడ పడివుంది. శర్మ ఆప్యాయత చూపలేక పోయినా, వెళ్ళిపొమ్మని మాత్రం చెప్పలేదు.

"ఇదెక్కడి పీడండీ ...ఏ మదనపల్లో తీసుకు పొమ్మనండి. వాడి దగ్గర క్షాన్ని చూసి పిల్లలు హడలిపోతున్నారు" భర్తకు కీ యిచ్చింది సుశీల.

రోగం ముదిరిపోయింది. శానిటోరి యంలో చేర్పించాలని చెప్పాడు.

"నాకేం తెలుస్తుందిరా .. నువ్వొచ్చి చెప్పండే."

"నాకెక్కడ ఖాళీయే.... పెద్దన్నయ్య దగ్గరకెళ్ళు."

ఏదో అనబోతున్న సామ్రాజ్యాన్ని వారించాడు వెంకటపతి. తక్షణమే రంగా రావు దగ్గరికి పయనమయ్యారు.

సీతమ్మ ఘొల్లుమంది. తల్లిని చూసి తనూ ఏడ్చింది సామ్రాజ్యం.

"మీరు ధైర్యంగా లేకపోతే ఎలా?" పార్వతి యిద్దర్నీ ఓదార్చింది.

చెల్లెలు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు రంగారావు. మళ్ళీ ఖర్చు తగిలిందని గాబరాపడి "డబ్బు చూడ్డానికి ఆలస్య మవుతుంది" అన్నాడు.

"డబ్బు నా దగ్గరుందిరా.... మదనపల్లి తీసుకెళ్ళు."

మధ్యాహ్నం కారులో ప్రమీల వచ్చింది. మర్నాడు కొడుకు పుట్టిన రోజుకి పిలవడానికి. సామ్రాజ్యంపై ఒక్క సానుభూతి వాక్యం కూడా అన లేదు.

"నీ కర్మ అలా వుంది మరి...."

ఆ రోగిష్టి వాతావరణంలో ఆమె అట్టె సేపు వుండలేకపోయింది. వెంటనే ప్రయాణమై తల్లిని "బయలుదేరు" అంది.

"నే నెక్కడికే? సామ్రాజ్యంతో వెళు తున్నాను."

ప్రమీల అసహనంగా చూసింది. ప్రక్క వసారాలో వాళ్ళున్నారని తెల్సి కూడ "అది అంటుజబ్బు తెల్సా ...దగ్గ రుంటే అంటుకుంటుంది. పెళ్ళాం కనుక దానికి తప్పదు" అంది.

పెద్దకూతుర్ని పురుగులా చూసింది సీతమ్మ "ఛీ నీ స్వార్థం పడ."

"నువ్వు వస్తావా రావా చెప్పు? ఆ రోగిష్టి వాళ్ళతో వెళతానంటే నా అభ్యం తరం ఏమీలేదు. నేను మాత్రం తిరిగి గుమ్మం ఎక్కను" వస్తున్న సామ్రా జ్యాన్ని చూసి ఆగిపోయింది.

"ఆయన పిలుస్తున్నారమ్మా . నెమ్మదిగా అంది.

వెంకటపతి ఆయాసంగా మంచంమీద కూర్చున్నాడు. సీతమ్మ తలుపులు దగ్గర నిలబడింది.

"మాతో రావద్దు మీరు" ఆయాసంగా అన్నాడు.

"అదేమిటి బాబూ, చిన్న పిల్లో ఒక్కతే ఏముంటుంది?"

"మీరు వస్తే . . నేను వెళ్ళను

కళ్ళలో జీర కనిపించింది వెంకటపతిలో తమ సంభాషణ వినపడిందని తల్లడిల్లి పోయింది సీతమ్మ.

శానిటోరియంలో జేర్పించి వచ్చేశాడు రంగారావు.

"మళ్ళీ వస్తావుకదరా అన్నయ్యా!" నీళ్ళ కళ్ళతో ఆశగా అడిగింది సామ్రాజ్యం.

"వీలువిబట్టి."

వీలయిన రంగారావు మళ్ళీ వెళ్ళ లేదు. ఉత్తరమయినా వ్రాయలేదు. సీతమ్మ కోడలిచేత రాయించేది.

పతంజలి మాత్రం ఒకసారి వచ్చాడు. ఎడారిలో జలాశయం చూసి నట్లుంది సామ్రాజ్యానికి. సంతోషం కన్నీటిలోకి మారిపోయింది.

"పిచ్చిపిల్లా. ఏడ్వకూడదు. డాక్టర్ని అడిగాను కదా. ఫర్వాలేదన్నారు. నెమ్మ దిగా తగ్గిపోతుంది."

"అంత అదృష్టమా బావా?"

పతంజలి ధైర్యం చెప్పాడు. "నువ్వు భయపడుతూంటే చెప్పు. మా గుమస్తాని పంపిస్తాను. సాయంగా వుంటాడు. మీ అక్క ఎలాగూ రాదు కదా!"

"వద్దులే బావా..అవసరమైతే రాస్తాను"

ఆ మంచితనానికి సామ్రాజ్యం ఉబ్బిర పడిపోయింది.

వెళ్ళిపోతూ వెయ్యిరూపాయలు యిచ్చాడు. సామ్రాజ్యం వద్దన్నా విన లేదు. "తీర్చివేద్దువుగానిలే .అవసరమైతే వ్రాయి."

పతంజలి వెళ్ళిపోయాకా వెంకటపతి అన్నాడు. "వచ్చింది ఎవరు?"

"మా బావ."

"కాదు. అన్నయ్య."

*　　*　　*

వెంకటపతి అనారోగ్యం వైద్యానికి లొంగలేదు. అస్థిపంజరంలా అయి పోయాడు. ఊపిరితిత్తులు రెండూ పాడై

పోయినాయి. డాక్టర్లు పెదవి విరిచారు. సామ్రాజ్యం భయపడుతూ అందరికీ టెలిగ్రాం యిచ్చింది. సీతమ్మ, పతంజలి వచ్చారు. అప్పటికే వెంకటపతి యిహ జీవితాన్ని ముగించాడు.

"నా రాతే పట్టిందే .. " సీతమ్మ ఘొల్లుమంది.

చూడవల్సిన వ్యవహారాలన్నీ పతంజలి చూశాడు. ఈసారయినా తోబుట్టువులు వస్తారని తనకి వూరట కల్గిస్తారని సామ్రాజ్యం ఎదురుచూసింది. కాని నిరాశపడక తప్పలేదు. వాళ్ళురారని సీతమ్మకు తెలుసు. సామ్రాజ్యంతో ఏం చెప్పలేదు.

"మా ఇంటికి తీసుకుపో బావా."

పతంజలి అర్థం కానట్లు చూశాడు.

"నేను వెంకటపతిగారి భార్యనికదా!"

సీతమ్మ జోక్యం చేసుకుంటూ "అక్కడెవరున్నారే? కర్మకాండలు చెయ్యాలి. వంటరిగా ఎలా వుంటావ్?" అంది.

"నా బాధ ఏదో పడుల్చుకున్నారు కదా . యింకా ఎందుకులే వార్ని బాధించడం?" విషాదంతో ఆమె గొంతుక వణికింది.

ఆమె మాటలు యదార్థమైనా సీతమ్మ ఒప్పుకోలేదు. ఆడది. ఎంత కాదన్నా కావల్సినవారి అండన వుండాలి. పాత తరం మనస్తత్వంతో సీతమ్మ అంగీకరించలేకపోయింది.

"వాళ్ళవల్ల భయమైతే నువ్వెళ్ళిపో" సామ్రాజ్యం కరకుగా అంది.

సీతమ్మ అల్లుడికేసి చూసి "దీనికి మతిపోలేదుకదా నాయనా" అంది.

"సామ్రాజ్యం చెప్పింది బాగానే వుంది."

పతంజలి తనని బలపరిచినందుకు సామ్రాజ్యం సంతోషించింది.

రెండువారాలు గడిచాయి. వెంకటపతి రోజులు తీరాయి. పతంజలి అవన్నీ చూశాకా ప్రయాణమయ్యాడు.

"ఉత్తరాలు రాస్తూండు సామ్రాజ్యం. అవసరమైతే వస్తాను."

"అలాగే బావా. నీకంటె ఎవరున్నారు కనుక?"

"జరిగినది మరచిపోవాలి. గతాన్నే ఆలోచిస్తూ కూర్చుంటే బ్రతుకు దుర్భరమవుతుంది. ఏదో వ్యాపకం కల్పించుకుని రోజులు కొత్తగా గడపాలి."

వెంకటపతి యిన్సూరెన్సు డబ్బు పాతికవేలు, పి. యఫ్. ఎనిమిదివేలు వచ్చాయి. సామ్రాజ్యం వాటిని బ్యాంక్‌లో వేసింది. ట్యుటోరియల్ కాలేజీలో చేరింది. చదువులోనయినా మునిగి కాలం గడుపుదామని. సీతమ్మని రమ్మని రంగారావు ఉత్తరాలు గుప్పిస్తున్నాడు.

"వెళ్ళిరా . నే నుండగలను లే" అని సీతమ్మని పంపించింది.

ఆ యేడు రైతులు శిస్తు ఎగనామం పెట్టారు. పండలేదని బొంకారు. సామ్రాజ్యం ఉత్తరం రాసి పతంజలిని రప్పించింది.

"ఆడదానివని వాళ్ళకి లోకువ సామ్రాజ్యం. ఏటా యిలా వీళ్ళతో బాధలు పడగలవా?"

"మరేం చేద్దాం.... కేసు పెడదామా?"




పతంజలి నవ్వాడు. "నీకు లోకజ్ఞానం లేదు మరదలా. సివిల్ దావాల్లో ఓడిన వాడు ఏడుస్తూ యింటికి వస్తాడు. నెగ్గిన వాడు యింటికొచ్చాక ఏడుస్తాడు. అంచేత అమ్మేసి రూపాయిలు దగ్గరుంచుకో."

సామ్రాజ్యం అంగీకరించింది. రైతులు అమ్మడానికి వీల్లేదని ఎదురుపేచీ లేవదియ్యబోయారు. పతంజలి చాకచక్యంగా ముప్పైఆరువేలకి అమ్మకం జరిపాడు. రిజస్ట్రేషన్‌కూడ అయిపోయింది.

సామ్రాజ్యాన్ని ఇంతకుముందు కాలం భయపెట్టేది. డబ్బు చేరగానే ఒక విశ్వాసం, నిబ్బరం కలిగాయి. దేన్నయినా జయించే సాహసం కల్గింది.

ఒకసారి వచ్చివెళ్ళమని రంగారావు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఏమిటీ వింత? సామ్రాజ్యం విడ్డూర పడిపోయింది. శర్మ దగ్గర్నుంచి, ప్రమీల దగ్గర్నుంచికూడ ఉత్తరాలు వస్తున్నాయి. సామ్రాజ్యం వేటినీ లక్ష్యపెట్టలేదు.

చదువుమీద యింట్రెస్టు కలగలేదు. బలవంతంగా చదివినా బుర్రకెక్కడం లేదు. మానేసింది. మహిళామండలిలో టైలరింగ్ నేర్చుకుంది కొన్నాళ్ళు. సినిమాలు, పుస్తకాలతో రోజులు వెళ్ళిపోతున్నాయి. కాని సామ్రాజ్యానికి ఉషారుగా లేదు.

ముప్ఫయివేలు పెట్టి సబ్బుల కంపెనీలో మేనేజింగ్ పార్టనర్‌గా చేరింది. ఆ కంపెనీ పెట్టి ఆర్నెళ్ళయింది. బాగానే నడుస్తోంది. సామ్రాజ్యానికి చేతినిండా పని దొరికింది. కాలక్షేపం బాగానే వుంది.

ఇంతలో సీతమ్మ పోయిందని ఉత్తరం వచ్చింది. సామ్రాజ్యానికి కన్నీరు ఆగలేదు. జీవితమంతా ఏడ్చేలాగే జరుగుతోందని వాపోయింది.

"అరె....ఏం జరిగింది?" మురళీధరం దగ్గరకి వచ్చాడు. సామ్రాజ్యం మాట్లాడ

లేదు. మురళీధరం ఉత్తరం చదివి ఓదార్చాడు.

"ఇవన్నీ మన జీవితాన్ని శాపించే సంఘటనలు. ఏం చేయలేం. మీరు ధైర్యంగా వుండాలి." మురళీధరం రైలెక్కుతూ అన్నాడు.

"మీరు శ్రమ తీసుకున్నారు..." సామ్రాజ్యం నొచ్చుకుంటూ అంది. తనని ఓదార్చడంతో తను ఏకాకి కాదని సామ్రాజ్యం సంతోషించింది.

"విత్ ప్లెజర్.... సాధ్యమైనంత తొందరగా రండి."

రైలు బయలుదేరింది కూతవేసి.

రంగారావు, శర్మ విలువైన అతిథిలా చూశారు సామ్రాజ్యాన్ని. ప్రమీల సరేసరి. సామ్రాజ్యం నివ్వెరపోయింది. ఛీ అనిపించుకున్నచోట ..శభాషా? ఈ కీర్తి తను బలిదానం చేసుకున్నాక వచ్చింది. మెరుగుల్నిబట్టి విలువలు మారతాయి. తనకి సేవలు చెయ్యడానికి రంగారావు, శర్మ పోటీ పడుతున్నారు.

"వ్యాపారం పడిపోయిందమ్మా. ఇరవై వేలుంటేగాని పైకి రావడానికి కుదరదు. నువ్వు కాదనవనే అడుగుతున్నాను" రంగారావు ప్రాధేయపడ్డాడు.

"కొత్తగా యిల్లు కట్టాను. పాతికవేలు అప్పయింది. అనవసరంగా వడ్డీ యిస్తున్నాను. నువ్వు సాయం చేస్తే...." శర్మ అడిగాడు.

వాళ్ళని చూస్తే అసహ్యం వేసింది సామ్రాజ్యానికి. తన జీవితాన్ని అన్యాయం చెయ్యడానికి వెనుకాడలేదు. పోనీ, తను మనుషులకోసం కళ్లుపెట్టి చూస్తున్నప్పుడు ఒక్కరి సాయమూ లేదు. ఈనాడు తను ముఖ్యురాలైంది, డబ్బునిబట్టి.

"మా వాడ్ని దత్తత చేస్కో" ప్రమీల ఆశగా అడిగింది.

"నాకు పిల్లలుండరనా?"

ముగ్గురూ విస్తుపోయారు.

"అన్యాయం చేశాను సామ్రాజ్యం .. కాని, నీ జీవితం నావల్ల మోడువారి పోకూడదు. ఒక జీవితకాలం మన స్వంతం. సూత్రాలకి భయపడి జీవితాన్ని వైరాగ్యంతో గడపకు. మళ్ళీ పెళ్ళి చేస్కో ..." వెంకటపతి ఆఖరి మాటలు గుర్తు వచ్చాయి.

"పెళ్లిచేసుకుంటున్నా ...నా కుటుంబం కోసం."

"విధవా వివాహమా? ఎవరా చవట?" రంగారావు పళ్ళు కొరికాడు.

"మీరు నాకేం చెయ్యలేకపోయారు. నేను మీకేం చెయ్యను. నా పరిధిలో మిమ్మల్ని తొలగించాను. ఒక కొత్త వ్యక్తికి చోటిచ్చాను. అతడు మురళీధరం."

వెంటనే బయలుదేరింది సామ్రాజ్యం.